క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీవిధమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నట్లు రజక సంఘ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయానికి వెనుక ఉన్న పూర్వపు ఆలయ స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజలు చేసి, శంకుస్థాపన నిర్వహించారు. సుమారు రూ.15 లక్షల అంచనాతో ఆలయ నిర్మాణానికి ప్రతిపాదనలో సిద్ధం చేశామన్నారు. కంకర కోనేరు గట్టుపై ఉన్న ప్రదేశంలో శంకుస్థాపన పూజలు నిర్వహించారు.

గంగానమ్మ లడ్డూల వేలం



వేలంలో దక్కించుకున్న లడ్డూలను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని గంగానమ్మకు నైవేద్యంగా పెట్టిన రెండు లడ్డూలను ఆదివారం వేలం నిర్వహించారు. అమ్మవారికి లలిత సూర్య స్వీట్స్ యజమాని ఆకుల రామచంద్రరావు నైవేద్యంగా సమర్పించిన 115 కేజీల డ్రైఫ్రూట్ లడ్డూ వేలం నిర్వహించగా, నడిపల్లి అంజనరావు వేలంలో రూ.1.55లక్షలకు దక్కించుకున్నారు. అలాగే భక్తాంజనేయ స్వీట్స్ యజమాని గుబ్బల రాంబాబు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 91 కేజీల డ్రైఫ్రూట్ లడ్డూను వైఎస్సార్ సీపీ నాయకుడు వందనపు వెంకటేశ్వరరావు రూ.57789లకు దక్కించుకున్నారు.

పంచాయతీకి ట్యాంకర్ బహూకరణ



పంచాయతీకి సమకూరిన వాటర్ ట్యాంక్

కొయ్యలగూడెం: సరిపల్లి పంచాయతీకి వాటర్ ట్యాంకర్ సమకూరింది. గ్రామానికి చెందిన ఆవల గంగరాజు జ్ఞాపకార్థం కుటుంబీకులు 1,50,000తో ట్రాక్టర్ ట్యాంకర్‌ను పంచాయతీకి అందజేశారు. ట్యాంకర్ ద్వారా తాగు నీటిని గ్రామ ప్రజలకు అత్యవసర సమయాల్లో అందించేందుకు కృషి చేయాల్సిందిగా పంచాయతీని దాతలు కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు గంగరాజు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

దెందులూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ రిపేర్‌లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తామని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ప్రతినిధి శిరోమణి అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ ఏలూరులో ఉచితంగా 30 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. వయసు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని ఐదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఉచిత నివాసం, భోజనం మెటీరియల్ శిక్షణ సమయంలో ఇస్తామని గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెదవేగి: పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9360 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రాజశేఖర్

దెందులూరు: దోసపాడులో పెదవేగి సీఐ రాజశేఖర్ పోలీస్ గ్రామసభ నిర్వహించారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ మద్యం దుర్వినియోగంపై ప్రభుత్వ చర్యలు, శిక్షలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వివాదాలకు దూరంగా ప్రశాంత జీవనం కొనసాగించాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై పూర్తి స్థాయి నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు వరం ఆదికర్మ యోగి అభియాన్

- జిల్లాలో 9 మండలాల్లో 46 గ్రామాల్లో పథకం అమలుకు శ్రీకారం
- రూ.826.48 కోట్లతో గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సంక్షేమానికి కృషి
- మండలాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్న అధికారులు



మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని కుగ్రామం అలివేరు



ఆదికర్మ యోగి అభియాన్ విజన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన అధికారులు

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతాల్లో సమర్థవంతమైన పాలన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లాలోని 9 మండలాల్లో 46 గ్రామాలను ఎంపిక చేసి ఈ కార్యక్రమం ద్వారా గిరిజనులు, గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నేతృత్వంలో అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గిరిజనాభివృద్ధికి ప్రతి ఫలాలు చిట్ట చివరి గ్రామం వరకు చేరాలన్నదే అధికారుల లక్ష్యం.

మండలాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్

ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమం జిల్లాలోని 9 మండలాల్లో 46 గ్రామాల్లో అమలవుతుంది. కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు గృహాలు, పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం వ్యవసాయ అనుబంధ రంగాలకు చేయూత, అభివృద్ధి, పింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు జరిగేలా అధికారులు మండలాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారు.

రూ.826.48 కోట్లు కేటాయింపు

ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమం జిల్లాలోని 46 గ్రామాల్లో అమలుకు సంబంధించి రూ.826.48 కోట్లు కేటాయించారు. బుట్టాయగూడెం మండలంలోని 19 గ్రామాలకు రూ. 326.43 కోట్లు, వేలేరుపాడులోని 9 గ్రామాలకు రూ.123.15 కోట్లు, పోలవరంలోని 5 గ్రామాలకు రూ.141.11 కోట్లు, జీలుగుమిల్లిలోని 5 గ్రామాలకు రూ. 54.15 కోట్లు, కుక్కునూరు మండలంలోని 2 గ్రామాలకు రూ. 3.53 కోట్లు, టి.నర్సాపురం మండలంలోని 1 గ్రామానికి రూ. 17.92 కోట్లు, చాట్రాయి మండలంలోని 1 గ్రామానికి రూ. 43.30 కోట్లు , నూజివీడు మండలంలోని 2 గ్రామాలకు రూ. 93.31 కోట్లు, చింతలపూడి మండలంలోని 2 గ్రామాలకు రూ. 17.55 కోట్లు చొప్పున నిధులు కేటాయించి గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదికర్మ యోగి అభియాన్ గిరిజనులకు వరం



ఆదికర్మ యోగి కార్యక్రమం గిరిజనులకు ఒక వరం. ఈ కార్యక్రమం అమలుతో గిరిజన గ్రామాల రూపురేఖలు మారిపోతాయి. గ్రామాల విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖకు సమర్పిస్తాం. మంజూరైన నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు చేపట్టేలా కృషి చేస్తాం.

–కె.రాములు నాయక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, కేఆర్ పురం

బస్సులు సరిపోక ప్రయాణికుల అవస్థలు



బస్టాండ్‌లో కిక్కిరిసిన బస్సు వద్ద అవస్థలు పడుతున్న ప్రయాణికులు

కొయ్యలగూడెం: దసరా సెలవులు ముగియడంతో ప్రజలు తమ గమ్య స్థానాలకు తిరుగు ప్రయాణానికి బయలుదేరారు. ఆదివారం వేలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం యాతనలు పడాల్సి వచ్చింది. నాలుగో తేదీ ఆటోవాలాలు తిరగకపోవడంతో ప్రయాణికులు పలు అవస్థలు పడ్డారు. విద్యార్థులైన తమ పిల్లలను వెంట బెట్టుకుని తిరుగు ప్రయాణానికి బస్టాండ్ వద్దకు వచ్చిన వారికి అవస్థలు తప్పలేదు. చివరకు అనేక మంది సోమవారానికి తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకుని తిరుగు ముఖం పట్టారు.

గోవిందా.. ఇవేం కష్టాలు



బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న ప్రయాణికులు



రద్దీలో బస్సు దిగలేక అవస్థలు పడుతున్న వృద్ధులు

ఆర్టీసీ బస్సులు ఎక్కలేక గగ్గోలు పెడుతున్న శ్రీవారి భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో యాత్రికులకు ప్రయాణ కష్టాలు తీరడం లేదు. ఆదివారం సైతం స్థానిక బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకు భక్తులు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. ఒక బస్సు ఎక్కేందుకు దాదాపు వంద మంది ప్రయాణికులు పోటీ పడ్డారు. కొంత మంది సీట్ల కోసం బస్సుల్లో కొట్టుకోవడంతో డ్రైవర్లు వారిని వారించారు. ఇదిలా ఉంటే పలు ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులను బస్సులు ఎక్కేవారు కనీసం బస్టాండ్‌లో దిగనివ్వలేదు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలూరు డిపోకు చెందిన బస్సులు మాత్రమే ఎక్కువ సర్వీసులు నడుస్తున్నాయి. మిగిలిన డిపో బస్సులు కేవలం రెండు మూడు మాత్రమే తిరుగుతున్నాయి. దీంతో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, రాజమండ్రి వైపు వెళ్లే భక్తులు ఏలూరు డిపో బస్సుల్లో భీమడోలు, గుండుగొలనుకు చేరుకుని, అక్కడి నుంచి గమ్య స్థానాలకు వెళుతున్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఈ కష్టాలు మొదలయ్యాయని పలువురు యాత్రికులు వాపోయారు.

ఘనంగా అన్నసమారాధనలు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక గంగానమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతల సాయంతో ఏర్పాటు చేసిన ఈ మహాన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, కొండ్రెడ్డి కిషోర్, పరిమి సత్తిపండు, మండవల్లి సోంబాబు, వందనపు వెంకటేశ్వరరావు, డీకేడీ సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, వగ్వాల పుల్లారావు, నడిపల్లి అంజనరావు, బలరాం రాంబాబు తదితరులు ప్రారంభించారు. ఆద్యంతం భక్తితో సాగిన ఈ మహాన్నదాన కార్యక్రమంలో 10 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

మహాన్న నివేదన

పట్టణంలోని ఆటోనగర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి మహాన్న నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అన్నం, పలు రకాల వంటకాలు నివేదనగా భక్తులు సమర్పించారు. అనంతరం మహాన్న నివేదనను భక్తులకు అన్న ప్రసాదంగా అందజేశారు.



మహాన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెట్టి గురునాథరావు, కరాటం రాంబాబు

అయ్యప్ప ఆలయంలో..

మండలంలోని గుర్వాయిగూడెం హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. దాతలుగా టెక్కికవారిగూడెం రాసమంటి మురళీకృష్ణ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చామర్తి శ్రీరాములు, ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

కొయ్యలగూడెం: కన్నాపురంలో కనకదుర్గమ్మ ఊరేగింపు మహోత్సవం ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. భవానీ మాలాధారణ భక్తులు దసరా సందర్భంగా బుట్టాయిగూడెం రోడ్‌లో ప్రత్యేకంగా నెలకొల్పిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగించారు.

అయ్యప్పలకు భిక్ష కార్యక్రమం ప్రారంభం

కొయ్యలగూడెం టెంపుల్ సెంటర్‌లో అయ్యప్ప స్వామి మందిరం వద్ద ఆదివారం నుంచి అన్న సమారాధన (భిక్ష స్వీకరణ) కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రోజు అన్న సమారాధన కార్యక్రమాన్ని సురక్షా హాస్పిటల్ డాక్టర్ కె.దిలీప్‌కుమార్ సౌజన్యంతో నిర్వహించారు. 41 రోజుల పాటు సుమారు 500 మందికి పైగా అయ్యప్ప స్వాములకు ప్రతి రోజూ మధ్యాహ్నం భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రోజుకో దాత విరాళంతో అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా మండల దీక్ష పూర్తయ్యే వరకు ప్రతి బుధవారం సాయంత్రం వేళలో ప్రజలకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు.



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

నూకాలమ్మ ఆలయంలో గోపూజ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి శంకర్ మహేష్ శర్మ, కె.విజయ పవన్ శర్మ సంయుక్తంగా గోపూజ నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ 6వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చండీహోమంలో మహాపూర్ణాహుతి సమర్పించడం ద్వారా కార్యక్రమాలు సంపూర్ణమవుతాయని తెలిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వెండి చీర తయారీకి అంకురార్పణగా భక్తుల వద్ద నుంచి సేకరించిన వెండిని చీర తయారీకి ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) ఆధ్వర్యంలో శాశ్వత ధర్మకర్తల మండలి సభ్యులు కారింగుల పార్థసారథి సూర్య చంద్రరావు, వెంకట శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా నిర్మాణకర్తలకు అందజేశారు.



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

క్షేత్రంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



శ్రీవారి కొండపైన దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. విజయవాడ దుర్గమ్మ ఆలయంలో దీక్షలు విరమించిన అనంతరం భవానీ భక్తులు చినవెంకన్న ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో పోటెత్తుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతం, షాపింగ్ కాంప్లెక్స్, అన్నదాన భవనం వద్ద భక్తులు కిటకిటలాడారు. వేలాది మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో లండన్‌లో సమావేశం నిర్వహించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం ఆపే వరకు పోరాటం చేస్తామన్నారు.



లండన్‌లో సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

రీసర్వే ప్రారంభం

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో మూడు గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని తహసీల్దార్ బి.సుమతి అన్నా రు. దెందులూరు మండలం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు అన్ని గ్రామాల సర్వేయర్‌లు, వీఆర్వోలు, వీఆర్ఏలు సమష్టిగా రీసర్వే పనులు పూర్తి స్థాయి పారదర్శకంగా చేస్తున్నారని తెలిపారు.



రీసర్వే చేస్తున్న సిబ్బంది

శ్రీవారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో కల్యాణ వేదికను నిర్మిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో సోమవారం రాత్రి నిర్వహించనున్న స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అనివేటి మండపంలో స్వామి వారి కల్యాణ వేదికను నిర్మిస్తున్నారు. ఈ పనులు శరవేగంగా చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ఈ పనులు పూర్తవుతాయని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆలయ పరిసరాలతో పాటు, కల్యాణ వేదిక ప్రాంతాన్ని పచ్చి పూలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. కల్యాణ వేడుక అనంతరం స్వామి వారి తిరువీధి సేవకు వినియోగించే వెండి గరుడ వాహనాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు. రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమయ్యే స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలో పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని ఈఓ తెలిపారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ ఎంపిక

కుక్కునూరు: ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన మండల కమిటీ ఎంపిక ప్రక్రియ ఆదివారం రాష్ట్ర నాయకుడు కుంజా శ్రీను ఆధ్వర్యంలో కుక్కునూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా సరియం ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జెడ్డి రఘుబాబు, ఉపాధ్యక్షుడిగా వెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శిగా కుంజా ముత్తయ్య, కోశాధికారిగా పైదా చిన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాడియం వేణుగోపాల్, పైదా బొర్రయ్య, పూజారి లక్ష్మీనారాయణ, తుర్సం నరసింహారావు, కొర్రి సిరమయ్య, శివ పాల్గొన్నారు.

నేడు ఆటల పోటీలు

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ సోమవారం జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం పి.సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, అథ్లెటిక్స్, షటిల్ పోటీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. కావున జంగారెడ్డిగూడెం మండలంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలల విద్యార్థులు ఎంపికలో పాల్గొనాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: చింతలపూడి పట్టణం శివారు గురుభట్లగూడెం రోడ్‌లో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ



వృద్ధులకు ఆహారం అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు భూషణం

కామవరపుకోట: ఆకలితో ఉన్న పేదలకు, వృద్ధులకు తన వంతు సహాయం చేస్తానని స్థానిక శ్రీసురక్ష ట్రస్ట్ అధ్యక్షుడు దాసి భూషణం అన్నారు. ఆదివారం ఆయన కామవరపుకోటలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు అందజేశారు. అలాగే మండలంలోని తడికలపూడి, కామవరపుకోటలోని పలు గ్రామాల్లో 35 మంది వృద్ధులు, అనాథలకు ఆహారం అందజేశారు. కార్యక్రమలలో ట్రస్ట్ సభ్యులు ఒ.అభిషేక్, ఎస్.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కొయ్యలగూడెం: విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఏడో తేదీ విజయవాడలో చేపట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో కోరారు. బోధనేతర పనులైన యాప్‌ల నిర్వహణ తగ్గించాలని, విద్యార్థులకు ఎటువంటి అదనపు ప్రయోజనం లేకుండా, ఉపాధ్యాయులకు అదనపు భారంతో పాటు బోధన సమయాన్ని హరించి వేసే అసెస్‌మెంట్ బుక్లెట్ విధానాన్ని రద్దు చేయాలనే తదితర డిమాండ్లతో ధర్నాకు పిలుపు ఇచ్చామన్నారు.

నేత్ర పర్వం.. గ్రామోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు తంగెళ్ళమూడి 28వ డివిజన్‌లో సీతారామ నగర్ చెరువుగట్టుపై వేంచేసియున్న శ్రీ విఘ్నేశ, శ్రీరామాలయ, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దసరా మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి సంకీర్తనలతో భజనలు చేశారు. అనంతరం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీడీ కాలనీ, లునాని నగర్, లక్ష్మి నగర్, సీతారామ నగర్ చెరువుగట్టు ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.